సాక్షి

శ్రీకాకుళం

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



సంచార సంజీవని

104 ఊరికి కొత్త ఊపిరి పోస్తోంది. సంచార సంజీవనిగా ఆదుకుంటోంది.

- IIలో



కారులో మృతదేహం

జిల్లా కేంద్రంలో ఓ కారులో యువకుడి మృతదేహం కనిపించింది. అనుమానాస్పద మృతి అని అతని భార్య ఫిర్యాదు చేశారు.

- IIలో

క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం నేడు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో క్రిటికల్ కేర్ యూనిట్ ఆదివారం ప్రారంభం కానుంది. ప్రధాన మంత్రి మోదీ వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా క్రిటికల్ కేర్ యూనిట్‌లను ప్రారంభించనున్నారు. ఆదివారం సాయంత్రం ఈ కార్యక్రమం జరుగుతుంది. ఆ తర్వాత ఇక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని రిమ్స్ వైద్య అధికారులు ప్రారంభిస్తారు. సోమవా రం నుంచి ఈ యూనిట్ పూర్తిస్థాయిలో పనిచేయనుంది.

న్యూస్‌రీల్

స్కిల్ కాలేజ్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రం (టీటీడీసీ)లో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పీబీ సాయిశ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత గల నిరుద్యోగ యువతకు మూడు నెలల కోర్సు పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో శిక్షణ ఇచ్చి, అనంతరం ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ సంస్థలు సంయుక్తంగా ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ, వసతి, భోజనం ఉచితమని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఆసక్తి గల యువకులు ఫోన్ నంబర్లు 7337330138, 8247656581ను సంప్రదించాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి వితరణగా పెళ్లి కానుకలు



పెళ్లిలో కానుకల రూపంలో వచ్చిన నగదును అర్చకునికి అందిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక జోగిపేట కూడలికి చెందిన చౌతా వీరభద్రాచారి, ఆయన కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారు. వీరభద్రాచారి మనుమరాలు అనుపోజు అపర్ణ, అవినాష్‌కు శుక్రవారం వివాహమైంది. పెళ్లిలో నగదు రూపంలో వచ్చిన కానుకలు రూ.1.03 లక్షలను నవ దంపతుల చేతుల మీదుగా స్థానిక సంతపేటలోని భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి వితరణగా అందజేశారు. శనివారం ఆ మొత్తాన్ని ఆలయ అర్చకుడు మల్లికార్జున స్వామికి ఇచ్చారు. వధూవరుల వెంట కుటుంబ సభ్యులు చౌతా షణ్ముఖరావు, శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ ఉన్నారు. వధూవరులతో పాటు కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు దుర్గామల్లికార్జునస్వామి అభినందించారు.

అధిక మొత్తంలో ఇసుక నిల్వ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అధిక మొత్తంలో ఇసుక నిల్వ చేయాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆదేశించారు. మైన్స్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రౌండ్ వాటర్, సెబీ, రెవెన్యూ, రవాణా శాఖల అధికారులతో శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో 12 రీచ్‌లు అనుమతులు పొందాయని, జిల్లాలో అన్ని ఇసుక స్టాక్ పాయింట్స్ వద్ద ఇసుక నిల్వలు చేయాలన్నారు.

● పెండింగ్ పాచిక

కదలి రారనేనా..?



● టీడీపీలో టికెట్ల ఉత్కంఠ కొనసాగింపు
● కదలిరా సభకు ముందు ధైర్యం చేయని చంద్రబాబు
● అభ్యర్థులను ఖరారు చేస్తే జన సమీకరణ జరగదని భయం
● ఇబ్బందుల్లేని టెక్కలి, ఆమదాలవలస, ఇచ్ఛాపురాలకు అభ్యర్థుల ప్రకటన
● తొలి జాబితాలో కళాకు మొండిచేయి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టికెట్ల కేటాయింపుపై టీడీపీ జిల్లా నాయకుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. తొలి జాబితా విడుదల చేసినా జిల్లాలో కొన్ని నియోజకవర్గాలకు మాత్రమే అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఇద్దరు ముగ్గురేసి ఆశావహులున్న ఐదు నియోజకవర్గాల జోలికి పోలేదు. ఈ క్రమంలో రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావుకు ఝలక్ ఇచ్చింది. జిల్లాలో ఆయనకు ధీటైన నాయకులుగా చెప్పుకునే అచ్చెన్నాయుడితో పాటు కూన రవికుమార్, బెందాళం అశోక్ పేర్లను ప్రకటించి అవమాన పరిచింది. గ్రూపుల పోరు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేయకపోవడం వెనుక 'చంద్రబాబు రా కదలిరా..' సభ ఉండటమే కారణమని తెలుస్తోంది. ఈ సమయంలో అభ్యర్థులను ఖరారు చేస్తే జన సమీకరణ చేయడం కష్టమని, భారీ అంచనాలతో నిర్వహిస్తున్న సభ అట్టర్ ఫ్లాప్ అవుతుందన్న భయంతోనే వెనక్కి తగ్గినట్టు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

నిరాదరణ గుబులు

రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు, లోకేష్‌లు రకరకాల పేర్లతో సభలు నిర్వహిస్తున్నారు. 'రా కదలిరా..' అంటూ చంద్రబాబు, శంఖారావం పేరుతో లోకేష్ సభలతో జనాల్లోకి వస్తున్నారు. వీరి రాక కోసం భారీగా జనసమీకరణ చేసేందుకు ప్రయత్నించినా ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో సభలు వెలవెలబోతున్నాయి. పార్టీకి ఉన్న బలం ఇంతేనా అని పార్టీ శ్రేణులకు కూడా సందేహం కలుగుతోంది. ఒకవైపు సీఎం జగన్ నిర్వహిస్తున్న సిద్ధం సభలు కనీవినీ ఎరుగని రీతిలో జరుగుతున్నాయి. లక్షలాది మంది హాజరై వైఎస్సార్‌సీపీకి ఉన్న బలమేంటో చూపిస్తున్నాయి. అధికార పార్టీపై ఎంత దుష్ప్రచారం చేసినా, పనిగట్టుకుని పెయిడ్ బ్యాచ్‌లతో విషం చిమ్ముతున్నా జనం మాత్రం తండోపతండాలుగా వస్తున్నారు. ఇది టీడీపీకి వణుకు పుట్టిస్తోంది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు నిర్వహించే సమావేశాలకు హాజరైన జనాల స్థాయిలో కూడా చంద్రబాబు, లోకేష్ సభలకు ప్రజలు హాజరుకావడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం నుంచి చంద్రబాబు సభలు గ్రాండ్‌గా నిర్వహించాలని, జిల్లా వ్యాప్తంగానే కాదు చుట్టు పక్కల జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ చేసి, అట్టహాసంగా నిర్వహించాలని ఆ పార్టీ అధిష్టానం లక్ష్యంగా పెట్టుకుంది. దానిలో భాగంగా గ్రామాల వారీగా జనాల కోసం నాయకులకు టార్గెట్ ఇచ్చింది. ఇప్పుడా పనిలోనే జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాల నాయకులు నిమగ్నమయ్యారు.

తేడా కొడుతుందన్న భయంతోనే..

ఈ పరిస్థితుల్లో జిల్లాకు సంబంధించి గ్రూపులున్న నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేస్తే అసలుకే ఎసరొస్తుందని, తన శ్రీకాకుళం సభ తుస్సుమంటుందన్న అభిప్రాయంతో చంద్రబాబు వెనక్కి తగ్గారు. సభకు ముందు అభ్యర్థులను ప్రకటిస్తే టిక్కెట్ రాని నాయకులకు అడ్డం తిరుగుతారని, పార్టీకి దండం పెట్టేసి జన సమీకరణ చేయరని, జనాలు రాకపోతే తన సభ మిగతా చోట్ల మాదిరిగా అట్టర్ ఫ్లాప్ పోతుందన్న భయంతో టిక్కెట్ల పంచాయతీని సాగదీయాలని నిర్ణయించారు. టిక్కెట్ వస్తుందన్న ఆశతోనైనా బల నిరూపణ చేసుకోవడానికి ఆశావహులు ప్రయత్నిస్తారని, ఈ క్రమంలో పోటీ పడి జనాలు తీసుకురావడం వల్ల సభ సక్సెస్ అవుతుందని అధినేత అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. దానిలో భాగంగానే టిక్కెట్ కోసం పోటీలేని ఆమదాలవలస, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసి, గ్రూపులున్న మిగతా ఐదు నియోజకవర్గాల అభ్యర్థుల ఖరారు ప్రక్రియను పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది. చంద్రబాబు వ్యూహంతో తనకు లాభం జరుగుతుందేమో గాని తమకు నష్టం జరుగుతుందని ఆశావహులు ఉన్నారు. కష్టపడి, డబ్బులు ఖర్చు పెట్టి జనాలు తీసుకొచ్చాక తమకు టిక్కెట్ ఇవ్వకపోతే తమ పరిస్థితేంటని ఆందోళన చెందుతున్నారు. తమను వాడుకోవడంలో తొలి నుంచే చంద్రబాబు ఇదే పంథా అనుసరిస్తున్నారని, చివరికొచ్చాక కూడా తన గేమ్ ఆపలేదని, వాడుకుని వదిలేస్తే తమ పరిస్థితి అయోమయమని ఆశావహులంతా ఆవేదనతో ఉన్నారు.

పొలిటికల్ టాక్

'కళా'కు తీరని అవమానం

పార్టీలో సీనియర్‌గా, పొలిట్ బ్యూరో సభ్యులుగా, గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, మంత్రిగా పనిచేసిన కళా వెంకటరావుకు చంద్రబాబు షాకిచ్చారు. తనకంటే జూనియర్లైన అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బెందాళం అశోక్‌లను అభ్యర్థులుగా ప్రకటించి, కళా వెంకటరావును వదిలేశారు. ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థుల ఖరారు ప్రక్రియ కూడా కళాకు అనుకూలంగా జరగలేదు. రాజాం అభ్యర్థిగా ప్రకటించిన కోండ్రు మురళీమోహన్‌ను కళా వ్యతిరేకిస్తున్నారు. కావలి ప్రతిభా భారతితో కలిసి మరో వ్యక్తికి టిక్కెట్ ఇవ్వాలని ప్రయత్నించారు. కానీ కళా పప్పులుడకలేదు. ఎక్కడ తేడా కొట్టిందో తెలీదు గానీ తన అనుకుని ప్రయత్నించిన వారికే కాకుండా తనకు కూడా తొలి జాబితాలో చోటు కల్పించకపోవడంతో కంగుతిన్నారు. వ్యూహాత్మకంగా తనను తొక్కే ప్రయత్నం చేస్తున్నారా? లేదంటే కొన్ని రోజులు టెన్షన్ పెట్టాలని చూస్తున్నారో గానీ కళా వెంకటరావుకు తీవ్ర అవమానమే జరిగిందని చెప్పాలి. ఇప్పుడిదే ఉమ్మడి జిల్లాలో చర్చ జరుగుతోంది. ఎచ్చెర్లలో తనకు పోటీగా ఉన్న కలిశెట్టి అప్పలనాయుడులో ఆశలు చిగురించేలా చేసింది.



పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా వేణుగోపాలుని కల్యాణం



మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు

గార: శ్వేతగిరిపై కొలువున్న కాళీయమర్దన వేణుగోపాలుని కల్యాణోత్సవం నవవాహ్నిక దీక్షతో శనివారం కన్నులపండువగా జరిగింది. మాఘ శుద్ధ సప్తమి మొదలుకొని తొమ్మిది రోజుల పాటు జరిగిన యాత్రోత్సవంలో భాగంగా మాఘ శుద్ధ పౌర్ణమి వేళలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత కాళీయ మర్దన వేణుగోపాలుని కల్యాణోత్సవంతో పాటు శ్రీలక్ష్మీ, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీకూర్మంకు చెందిన కూర్మరాజాచార్యులు, మహేంద్రాడ సాయిశర్మ, నాగరాజుశర్మలు ఈ క్రతువు నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పల్లి నర్సింహులు, కొయ్యాన నాగభూషణం, జల్లు గౌరిపతినాయుడు, చింతల గడ్డెయ్య, అచ్యుతరావు భక్తులు పాల్గొన్నారు.

● డాన్ సేవలకు సెల్యూట్



అధికారిక లాంఛనాలతో పోలీసు జాగిలం అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ డాగ్ స్క్వాడ్‌లో కీలకంగా సేవలు అందించిన జాగిలం డాన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో అధికార లాంఛనాలతో డాన్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ జీఆర్ రాధిక నివాళులు అర్పించారు. గాలిలో కాల్పులు జరిపి పోలీసులు నివాళులు అర్పించారు. 12 ఏళ్ల పాటు పోలీస్ విభాగంలో డాన్ సేవలు అందించింది. 2011 జూలై 24న జన్మించిన ఈ జాగిలం డాబర్ మ్యాన్ బ్రీడ్‌కు చెందినది. హైదరాబాద్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో శిక్షణ అనంతరం జిల్లా పోలీస్ శాఖకు కేటాయించారు. ఈ డాగ్‌కు బీవీ రమణ హ్యాండ్లర్‌గా వ్యవహరించారు. అంత్యక్రియలో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శేషాద్రి నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

● కడలి ఒడిలో..



మాఘ పౌర్ణమి నాడు భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. పుక్కళ్లపాలెం సముద్రతీరంలో ఆదివారం భక్తులు స్నానాలు చేసి సమీపంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కవిటిలోని జగన్నాథస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. - కవిటి

చేపల పెంపకంతో గిరిజనులకు ఉపాధి



మాట్లాడుతున్న మత్స్యశాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్‌నాయక్

మందస: గిరిజన ప్రాంతాల్లో గల నీటి వనరులను వినియోగించుకుని, చేపల పెంపకంతో గిరిజనులు ఉపాధి పొందాలని మత్స్యశాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్‌నాయక్ (విశాఖపట్నం) అన్నారు. మండలంలోని బుడారిసింగిలో శనివారం గిరిజనులకు ఒక్కరోజు సామర్థ్యం నిర్మాణ అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు రిజర్వాయర్ ఫిషరీష్‌లో బయో సెక్యూరిటీ, వ్యక్తిగత పరిశుభ్రతపై ఎలా తీసుకోవాలో వివరించారు. చేపలవేటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. శిక్షణ పొందిన కుటుంబాలకు బయో సెక్యూరిటీ కిట్లను అందజేశారు. కళింగదళ్ జలాశయాన్ని గిరిజనులు వినియోగించుకుని, చేపలను పెంపకం చేసుకుని, వ్యాపారం ద్వారా ఆర్థికాభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బుడారిసింగి సర్పంచ్ సురేష్‌కుమార్‌పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన ఎంపీఈడీఏ సబ్-రీజనల్ డివిజన్ విశాఖపట్నం, ఎన్ఏసీఎస్ఏ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ(శ్రీకాకుళం), మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజ్‌పాత్రో(టెక్కలి), ఫీల్డ్ మేనేజరు పి.సునీల్ కుమార్, ఎస్.సంతోషి, రూప, ఎంపీటీసీ సీర లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై ప్రచారం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వాధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞానశ్రీ సువర్ణరాజు అన్నారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం శనివారం న్యాయ సేవా సదన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన శ్రీ సువర్ణరాజు మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఆ కేసులను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ తీర్మానించి, సమస్యను బట్టి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేస్తామని, సమస్య లేకుంటే ఆ కేసును ముగించడం జరుగుతుందని తెలిపారు. ఉచితంగా అందే ఈ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి కేసులనైనా కేవలం రెండు నెలల్లో పరిష్కరిస్తారని అన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, పోస్టల్ డిపార్టుమెంట్‌కు సంబంధించి కామేశ్వర్ చంద్ర పాత్ర రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి బీటీవి.రామారావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు తప్పనిసరి



శిక్షణలో మాట్లాడుతున్న జెడ్పీ ముఖ్య కార్య నిర్వహణాధికారి డి.వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం ఎంసీసీ నోడల్ అధికారులు, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీలు, ఎంపీడీఓలు, అన్ని మండలాల స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సి-విజిల్, సువిధ తదితర అంశాలపై మొదటి దశ శిక్షణ సమావేశం నిర్వహించారు. నిబంధనల ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాల్సి ఉంటుందని, అన్ని అంశాలపై నోడల్ అధికారులను నియమించామని, రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల ప్రచార సంబంధిత సమావేశాలు, ర్యాలీలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి సువిధ యాప్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేయాలని అన్నారు.

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ప్రకటనలకు ఎం.సి.ఎం.సి ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలని, ఎన్నికల ప్రచారంలో వినియోగించే ఆడియో, వీడియోలను పరిశీలించి ఎం.సి.ఎం.సి (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) ధ్రువీకరించాలని, అలాగే ఎలక్ట్రానిక్ రూపంలో వచ్చే ప్రకటనలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. అలాగే పెయిడ్ న్యూస్ విషయంలో కమిటీ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్దేశాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. సోషల్ మీడియా, ఇ-పేపర్లు, కేబుల్ నెట్‌వర్క్‌తో సహా టీవీ, రేడియో చానెళ్లు, ఆడియో - వీడియో డిస్‌ప్లేలు, సినిమా హాళ్లు, ఇంటర్నెట్ ఆధారిత మీడియా, వెబ్‌సైట్‌ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుందని చెప్పారు.

రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే..

ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నగదు సీజ్ చేసే సమయంలో సంబంధిత వ్యక్తులకు రశీదు తప్పనిసరిగా అందించాలని ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసన్న లక్ష్మి తెలిపారు. సీజ్ చేసిన బంగారం, నగదు రూ.10 లక్షల కంటే తక్కువ విలువైనది అయితే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌నకు అప్పగించాలని, రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసిన నగదు, బంగారం, మద్యం, ఇతర విలువైన ఆభరణాల గురించి మీడియాకు సమాచారం అందించాలని, అదే విధంగా సంబంధిత వ్యక్తులు చేసిన అప్పీల్ అనంతరం విడుదల చేసే నగదు వివరాలు సైతం అందించాలని, వివరాలతో నిర్దేశిత నమూనాలో నివేదిక సమర్పించాలని తెలిపారు.

క్లుప్తంగా

'బ్యాంక్ అప్రయిజర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి'



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఉన్న అన్ని బ్యాంక్‌లలో పనిచేస్తున్న బ్యాంక్ అప్రయిజర్స్‌కు ఉద్యోగభద్రత కల్పించాలని ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్ యూనియన్ ప్రతినిధులు కె.మోహన్, కె.దుర్గాప్రసాద్, డి.అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీహాల్‌లో శనివారం ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్‌కు ఏవైనా సమస్యలు ఉంటే ఆ సమస్యలపై అన్ని బ్యాంక్‌ల అప్రయిజర్స్ సమష్టిగా పోరాటం చేయాలన్నారు. మార్చి 10న విజయవాడలో ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్ ద్వితీయ మహాసభ జరగనుందని తెలిపారు. ఈ సభకు అందరు అప్రయిజర్స్ హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం చలో విజయవాడకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆల్ బ్యాంకు అప్రైజర్స్ యూనియన్ ప్రతినిధులు కె.మోహనరావు కె.దుర్గా ప్రసాద్, ఎస్.శ్రీనివాస్, పి.మురళి, ఎం.రాంబాబు, ఏఐటీయూసీ నాయకుడు తిరుపతిరావు, అధిక సంఖ్యలో అప్రయిజర్స్ పాల్గొన్నారు.

కన్నయ్య కళ్లు సజీవం



నేత్రదానం చేసిన మృతుడు కన్నయ్య

టెక్కలి రూరల్: స్థానిక మెట్టవీధికి చెందిన చిలుకు కన్నయ్య(79) శనివారం మృతిచెందారు. మృతి విషయం తెలుసుకున్న టెక్కలి ప్రజా చైతన్య కళా సమితి నిర్వాహకులు మల్లారెడ్డి పద్మనాభం, దూసి ఆంధ్రాస్టాలిన్‌లు మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి ఒప్పించారు. అనంతరం శ్రీకాకుళం రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ సొసైటీ సిబ్బంది కె.పవన్, టి.సుజాతలు కన్నయ్య నేత్రాలను సేకరించారు. నేత్ర దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను స్థానికులు అభినందించారు.

అద్దె బస్సుల కోసం టెండర్ల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన 32 బస్సులను సరఫరా చేసేందుకు ఔత్సాహిక ఆపరేటర్ల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగిన ఆపరేటర్లు ఎంఎస్‌టీసీ ఈ-కామర్స్ పోర్టల్ www. mstcecommerce.com నందు రిజిస్టర్ చేసుకుని, ఈ నెల 21 తేదీ నుంచి మార్చి 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు టెండర్ల ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ మార్చినెల 14వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి అదే రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సూపర్ లగ్జరీ: శ్రీకాకుళం - విజయవాడ మార్గంలో 1 బస్సు, అల్ట్రా డీలక్స్: శ్రీకాకుళం - విశాఖ మార్గంలో 6 బస్సులు, పలాస - విశాఖ మార్గంలో 3 బస్సులు, ఎక్స్‌ప్రెస్: శ్రీకాకుళం - విజయనగరం మార్గంలో 4, శ్రీకాకుళం - పాలకొండ మార్గంలో 2, ఇచ్ఛాపురం - విశాఖపట్నం మార్గంలో 4 బస్సులు, అల్ట్రా పల్లె వెలుగు: శ్రీకాకుళం - విశాఖపట్నం మార్గంలో 2 బస్సులు, పల్లె వెలుగు: శ్రీకాకుళం - సాలూరు మార్గంలో 1, శ్రీకాకుళం - బత్తిలి మార్గంలో 5, టెక్కలి - పలాస (వయా పూండి) మార్గంలో 2, శ్రీకాకుళం - పలాస మార్గంలో 1, టెక్కలి - శ్రీకాకుళం(వయా సంతబొమ్మాళి) మార్గంలో 1 బస్సు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ బస్సులు శ్రీకాకుళం 1వ డిపోకి 11, శ్రీకాకుళం 2వ డిపోకి 12, టెక్కలి డిపోకి 6, పలాస డిపోకి 3, మొత్తం కలిపి 32 బస్సులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు విజయ్‌కుమార్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం apsrtc.ap.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నాటుసారా స్థావరాలపై ఎస్‌ఈబీ దాడులు



సవరమధ్య సమీపంలో ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం ఊటలు

మందస: మందస మండలంలోని గిరిజన ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఎస్‌ఈబీ సోంపేట సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో పిడిమందస పంచాయతీలోని సవరమధ్య ప్రాంతంలో గల నిర్వహించిన ఈ దాడుల్లో నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలు అరికట్టేందుకు కృషి చేస్తున్నామని, నిందితులను గుర్తించి, చర్యలు తీసుకుంటామన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రేమ్‌కాజల్ ఆదేశాల మేరకు నాటుసారా తయారీ కేంద్రాలు, అమ్మకాలు, రవాణాపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐ వై.చంద్రమోహన్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, యోగీశ్వరరావునాయుడు పాల్గొన్నారు.

సంచార సంజీవని



జిల్లాకు కేటాయించిన కొత్త 104 వాహనాలు



పొందూరు మండలం కింతలి పీహెచ్‌సీ పరిధిలో 104 వైద్య సేవలు అందుతున్న దృశ్యం

- 104 వాహనాలతో ఊరికి కొత్త ఊపిరి
- ప్రతి నెల సొంతూరిలో పల్లెవాసికి అందుతున్న వైద్య సేవలు
- రికార్డు స్థాయిలో ఈ ఏడాదిలోనే 25 లక్షల మందికి వైద్యపరీక్షలు

ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 104 వైద్య సేవలను పరిశీలిస్తే...

సంవత్సరం	ఓపీ కేసులు	బీపీ	సుగర్	పరీక్షలు
2020-21	4,48,604	71,956	51,608	8,97,208
2021-22	6,52,351	1,59,773	1,34,597	13,14,114
2022-23	7,50,837	3,09,437	2,67,823	15,11,679
2023-24	12,84,264	4,47,504	3,54,660	25,68,528

అరసవల్లి: సంచార సంజీవని ఊరికి కొత్త ఊపిరి అందిస్తోంది. గ్రామాల్లో మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులతో పాటు అనారోగ్య బాధితులకు 104 వాహనాల సంచార వైద్య సేవలు (ఎంఎంయూ) వరంలా మారాయి. ఎటూ వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంతూరులోనే మెరుగైన వైద్య సేవలు ఈ సంచార వాహనాల ద్వారా ఉచితంగా అందుతున్నాయి. రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నవారికి, గర్భిణులకు 104 సేవలు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. ప్రతినెలా రెండు సార్లు ఠంచన్‌గా ప్రతి గ్రామాన్ని 104 ఎంఎంయూలు సందర్శిస్తూ ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్నాయి. గత సర్కార్ హయాంలో మంచం పట్టిన ఈ వ్యవస్థకు జవసత్వాలు కల్పించి ప్రతి మండలానికి 104 వాహనం అందుబాటులో ఉండేటా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

నాడు 22.. నేడు 52

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ నిర్వహణ బాధ్యతలతో ఈ వాహనాలు నడుస్తున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో 38 మండలాలకు గత ప్రభుత్వం హయాంలో కేవలం 22 వాహనాలే వైద్యం అందించేవి. దీంతో గ్రామాల్లో పూర్తి స్థాయిలో విజిట్స్ జరిగే వీలుండేది కాదు. కానీ ఇప్పుడు విభజిత జిల్లాలో ఉన్న 30 మండలాలకు మొత్తం 52 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. పీహెచ్‌సీల పరిధిలో నెలలో రెండు సార్లు సంచార వాహనాలు విజిట్ చేస్తూ ఉదయం గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నాయి.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానిస్తూ...

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగానే జిల్లాకు కొత్తగా 25 వాహనాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇవి రాకముందు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో నెలకు ఒక్కో రోజు చొప్పున విజిట్స్ జరిగాయి. కొత్త వాహనాల రాకతో ఇప్పుడు నెలకు రెండు రోజుల పాటు గ్రామాల్లో ఉచిత వైద్య సేవలందుతున్నాయి. వివిధ రోగాలతో, ప్రమాదాలతో ఇళ్లకే పరిమితమైన రోగులకు పీహెచ్‌సీ వైద్యుడు నేరుగా ఇంటికి వెళ్లి వైద్యం అందించేలా ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం డిజైన్ చేసిన సంగతి విదితమే.

104 వైద్య సేవలు ఇలా..

- పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల్లో ఉదయం 8.30 గంటలకు సాయంత్రం 4.30 గంటల వరకు 104 వాహనం అందుబాటులో ఉంటుంది. 104 వైద్యుడితో పాటు సంబంధిత పీహెచ్‌సీ వైద్యుడు, ఏఎన్ఎం, ఆశ వర్కర్ అక్కడే అందుబాటులో ఉంటారు.
- మధ్యాహ్నం వరకు గ్రామ సచివాలయాల వద్ద రోగులకు వైద్య సేవలు అందిస్తారు. అనంతరం నడవలేని వారు, మంచాన పడిన వృద్ధులు, దివ్యాంగులు ఇతర రోగులకు ఇళ్ల వద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు.
- 104లో ఉండే డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రతి రోగి వివరాలను ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డులో పొందుపరుస్తారు. ఈ వివరాలను టెలీ మెడిసిన్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు అనుసంధానించి భవిష్యత్‌లో తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.
- రోగికి మెరుగైన వైద్య సేవలు అవసరమైతే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రులకు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. సంబంధిత రోగిని ఆస్పత్రికి తరలించే బాధ్యతల కూడా స్థానిక ఏఎన్ఎం నిర్వర్తిస్తున్నారు.

సేవలు పెరిగాయి



జిల్లాలో 30 మండలాలకు ఇప్పుడు 52 వాహనాలున్నాయి. ఈ ప్రభుత్వంలో గత ఏడాది 25 వాహనాలు కేటాయించారు. దీంతో గతంలో వెళ్లలేని చాలా గ్రామాల్లోకి ఇప్పుడు 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించగలుగుతున్నాం. ప్రభుత్వ ప్రోత్సాహంతో అరబిందో యాజమాన్యం ఆధ్వర్యంలో ఎక్కడా రాజీ పడకుండా ఉచిత వైద్య పరీక్షలు జరిపి మందులను పంపిణీ చేస్తున్నాం. గత ఏడాది కంటే గణనీయంగా ఓపీ పెరిగింది. 2023-24 ఇప్పటివరకు 12.84 లక్షల వరకు ఓపీ కేసులు రాగా, 25 లక్షల మందికి పైగా పరీక్షలు చేయడం ఒక రికార్డుగా నమోదైంది.

– వినోద్‌కుమార్, 104 విభాగం జిల్లా మేనేజర్.

పురుషోత్తపురం పీహెచ్‌సీ ప్రారంభం



పురుషోత్తపురం ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: ఆరోగ్య రంగం అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో రూ.2కోట్ల 30 లక్షలతో నిర్మించిన కిల్లి వెంకటఅప్పలనాయుడు ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆస్పత్రి ఆవరణలో కేవీజీ తల్లిదండ్రులైన కిల్లి వెంకట అప్పలనాయుడు, విశాలాక్షి దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని కూడా ప్రారంభించారు. పల్లె ప్రజలకు వైద్యం సులువుగా అందాలని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకువచ్చారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించే దిశగా పనిచేస్తున్నామని వెల్లడించారు.

కేవీజీ తపన గొప్పది..

అడుగు స్థలం కోసం కొట్లాట పడి కోర్టులకు ఎక్కుతున్న కాలంలో.. సొంత ఊరి కోసం కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ కోటికిపైగా విలువైన స్థలాన్ని పీహెచ్‌సీకి దానం చేయడం గొప్పదని స్పీకర్ కొనియాడారు. తాను స్పీకర్‌గా పదవిలోకి వచ్చిన నాటి నుంచి తన గ్రామానికి ఆస్పత్రి కావాలని చాలాసార్లు అడిగారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి రమాదేవి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ జీవీ శివానందమూర్తి, స్థానిక సర్పంచ్ కిల్లి రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ పైడి నర్సింహ అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కావిలాపు చంద్రశేఖర్, పార్టీ నేతలు కిల్లి రామ్మోహన్‌రావు, యువనేత కిల్లి వెంకటేష్, డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఆదిత్యలో జాతీయ స్థాయి గోకార్ట్ చాంపియన్ షిప్

టెక్కలి: ఈ నెల 26 నుంచి 29 వరకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో 2024–గోకార్ట్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.4 లక్షల వరకు నగదు బహుమతిని అందజేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే కర్నాటక రాష్ట్రం నుండి గ్లోబల్ అకాడమీ ఆఫ్ టెక్నాలజీ, తెలంగాణ రాష్ట్రం నుంచి బీవీఆర్ఐటి, ఆంధ్రప్రదేశ్ నుంచి కేఎల్ యూనివర్సిటీ, ఎంజీఆర్, అనిట్స్, గీతమ్, జీఎంఆర్, శ్రీవిష్ణు, కాకినాడ ఆదిత్య, ఎస్ఆర్ఆర్ కళాశాల నుంచి ఒక్కో బృందం పాల్గొన్నట్లు వెల్లడించారు. రఘు, ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి రెండేసి బృందాలతో కలిపి మొత్తం 15 ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ గోకార్ట్ పోటీలతో నాలుగు చక్రాల వాహనాల తయారీపై విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు.

'బాగా పనిచేస్తే విజయం మనదే'



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త, నాయకుడు మరింతగా పనిచేస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయాన్ని కైవసం చేసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్థానిక టౌన్‌హాల్‌లో శనివారం శ్రీకాకుళం రూరల్ మండల బూత్ కన్వీనర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలన స్వర్ణయుగంలా గడిచిందని అన్నారు. గ్రామాల్లో ఏవైనా లోటుపాట్లు ఉంటే గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలన్నారు. పొరపాటున తెలుగుదేశం ప్రభుత్వానికి ఓటు వేస్తే భవిష్యత్ తరాలన్నీ అట్టడుగుకు వెళ్లిపోతాయని అన్నారు. చంద్రబాబు మళ్లీ మోసపూరిత హామీలతో జనాలను వంచించేందుకు వస్తున్నారని, ప్రజలంతా అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నాయకులంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ సంక్షేమాభివృద్ధి పరిపాలనలో చరిత్ర సృష్టించిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. శ్రీకాకుళాన్ని దశదిశలా అభివృద్ధి చేస్తున్న నాయకుడు ధర్మాన ప్రసాదరావు అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు, మండల అధ్యక్షుడు చిట్టి జనార్దన రావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణ, జెడ్పీటీసీ రుప్ప దివ్య పాల్గొన్నారు.

'జిల్లాకు టీడీపీ చేసిందేమీ లేదు'



ఉద్దానం గోపీనాథపురంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వేదికపై పేరాడ తిలక్

వజ్రపుకొత్తూరు: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు జిల్లాకు ఒరిగిందేమీ లేదని, 10 ఏళ్లు ఎంపీగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు జిల్లా అభివృద్ధి ఏం చేశారో చెప్పాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన శనివారం వజ్రపుకొత్తూరు మండలం పూండి–గోవిందపురం, ఉద్దానం గోపీనాథపురం, అమలపాడు, పెద్దమురహరిపురం గ్రామాల్లో రూ.3.85 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, ప్రయాణికుల విశ్రాంతి భవనం, రైతు భరోసా కేంద్రం, బీటీ రహదారి, సీసీ రహదారులు, పాఠశాల భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవిందపురం సర్పంచ్ పాలిన రమ్య, యాజీపురం సర్పంచ్ కర్ని శ్రీను, అమలపాడు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, పీఎంపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు గొరకల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రామ్మోహన్ నాయుడు రెండుసార్లు ఎంపీగా పనిచేసినా కేంద్రం నుంచి ఒక్క ప్రాజెక్టును కూడా జిల్లాకు తీసుకురాలేదన్నారు. ఎవరికీ ఉపయోగపడని బెంచీల నాయుడు మనకు అవసరం లేదన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారని మండిపడ్డారు. మూలపేట పోర్టు పనులు పూర్తయితే జిల్లా రూపురేఖలు మారిపోతాయన్నారు.

చంద్రబాబు మోసగాడు: పేరాడ తిలక్

చంద్రబాబు నాయుడు పచ్చి మోసగాడని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజుకు గౌతు శివాజీ, శిరీషకు మధ్య ఉన్న వ్యత్యాసం గమనించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైస్ ఎంపీపీ వంక రాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, క్లస్టర్ ఇన్‌చార్జులు మద్దిల హరినారాయణ, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



కుంచాలకూర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శనివారం ఘనంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కర శర్మ ఆధ్వర్యంలో శ్రీ చక్రాలకు, మహా మేరువులకు పూజలు నిర్వహించారు. 1001 శ్రీ చక్రాలకు భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



శ్రీ చక్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో పీఏసీఎస్ డైరెక్టర్‌కు గాయాలు

కొత్తూరు: కొత్తూరు మండలం కుంచాలపేట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పారాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పీఏసీఎస్ డైరెక్టర్ కుంచాల నూకరాజుకు గాయాలయ్యాయి. నూకరాజు మండలంలోని దాశరథిపురంలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి స్కార్పియోలో వస్తుండగా కుంచాల పేట వద్ద అలికాం-బత్తిలి రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో నాగరాజుకు గాయాలయ్యాయి. వెంటనే కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

చీఫ్ వార్డెన్, స్పోర్ట్స్ డీన్ నియామకాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మహిళా వసతి గృహం చీఫ్ వార్డెన్‌గా బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.లోకేశ్వరి, స్పోర్ట్స్ డీన్‌గా డాక్టర్ యు.కావ్య జోత్స్న నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని ఆదేశాలపై శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ దాడులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై శనివారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు చేసి జరిమానాలు విధించారు. దేశిపాలేం గ్రామంలో చిట్టేరుక అసిరయ్య కోళ్లఫారంలో అప్పయ్య అనే వ్యక్తి మీటర్ బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్ సిబ్బంది తనిఖీలను చేసి అసెస్మెంట్, కాంపౌండ్ మొత్తం రూ. 61,140 లను అపరాధ రుసుం కింద విధించారు. అలాగే రేగపాలేం గ్రామంలో కె.పరసయ్య అనే వ్యక్తి కూడా తన కోళ్ల ఫారంలో మీటర్ బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు రూ.70,235 అపరాధ రుసుం వేసి కేసు నమోదు చేశారు. అలాగే అదే ప్రాంతంలో విద్యుత్ చౌర్యం చేస్తున్న మరో 26 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులతో పాటు విజిలెన్స్ ఏడీఈ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

బోటులో నుంచి పడి మత్స్యకారుడు మృతి



మృతి చెందిన కామరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: బోటులో నుంచి పడిపోయి బడివానిపేట గ్రామానికి చెందిన అలుపన కామరాజు(40) మృతి చెందారు. కామరాజుతోపాటు అల్లుపల్లి రాము, చీకటి సత్యారావు, సూరాడ రాము వేటకు వెళ్లగా, సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉండటంతో తీసుకువెళ్లిన వలలు ఉపయోగపడవని, వలలు మార్పు చేయాలని వెనుదిరిగారు. తిరుగు ప్రయాణంలో బోటు కుదుపులకు కామరాజు కిందకు పడిపోయాడు. దీంతో దెబ్బ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. మిగిలిన మత్స్యకారులు ఆయననను ఒడ్డుకు తీసుకురాగా అప్పటికే మృతి చెందారు. మృతుని భార్య కన్నమ్మ ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు సంఘన స్థలానికి చేరుకొని విచారించి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కారులో యువకుని మృతదేహం



కారులో మృతదేహం (ఇన్‌సెట్‌లో) కొర్లయ్య

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని అరసవల్లి వెలమవీధి పీహెచ్‌సీ పక్కన పార్క్ చేసిన కారులో యువకుని మృతదేహం శనివారం ఉదయం బయటపడింది. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని దమ్మలవీధిలో నివాసముంటున్న మాడుపిట్ల కొర్లయ్య (కిరణ్‌కుమార్, 34) ఫొటోగ్రాఫర్‌గా ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నాడు. ఇతనికి 2012లో బుడుమూరు గ్రామానికి చెందిన నారాయణమ్మతో ప్రేమ వివాహం జరిగింది. ఇద్దరు మగపిల్లలు సంతానం కాగా ఒక కుమారుడు ఏడేళ్ల కిందటే చనిపోయాడు. వృత్తిరీత్యా కొర్లయ్య ప్రతి రోజూ ఉదయం బయటకు వెళ్లిపోయి రాత్రి చాలా ఆలస్యంగా ఇంటికొచ్చేవాడు. ఒక్కోసారి రాత్రి రాకుండా ఉదయాన్నే వచ్చేవాడు. ఈ క్రమంలో ఈ నెల 23న(శుక్రవారం) ఉదయం ఇంటి నుంచి తన కారులో బయటకు వెళ్లాడు. మధ్యలో తన భార్య నారాయణమ్మ ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. సాయంత్రం అయ్యేసరికి కొర్లయ్య ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఎంత సమయం గడిచినా ఇంటికి రాకపోవడంతో భార్యకు అనుమానం వచ్చి చుట్టుపక్కల గాలించింది. బంధువులకు కూడా విషయం చెప్పింది. శనివారం ఉదయం 11 గంటల సమయంలో కొర్లయ్య అరసవల్లి వెలమ వీధి పీహెచ్‌సీ వద్ద పార్కింగ్ చేసిన కారులో స్పృహ లేకుండా పడి ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడకు నారాయణమ్మ, బంధువులు చేరుకున్నారు. డ్రైవింగ్ సీట్‌లో కొర్లయ్య చలనం లేకుండా ఉండటం చూసేసరికి ప్రాణం పోయిందని నిర్ధారించుకున్నారు. అప్పటికే అక్కడకు పోలీసులు చేరుకున్నారు. ఈ కారు శుక్రవారం ఉదయం నుంచి ఇక్కడే ఉందని ఓ మహిళ తెలిపారు. తన భర్త మృతిపై తనకు అనుమానాలు ఉన్నాయని నారాయణమ్మ పోలీసులకు చెప్పడంతో వారు కేసు నమోదు చేశారు.